## చట్టం సాహితీ లోకం
95814 19999

### చెట్టు మనసు :




చెట్ల కన్నీళ్లే మానవుల పన్నీరా?
చెట్ల మరణాలే
నాగరికరణాల..
అరణ్య రోదనలే
అభివృద్ధి సూచికలా?
అడవుల నరికీవేతే
మానవ సౌభాగ్యాలా?
అడివి మరణమే
ఈ పుడమి అభివృద్దా?
వన్యప్రాణుల మరణాలే
మానవ చట్టాలా?
జంతు సంరక్షణ ఎక్కడ?
అడవుల పరిరక్షణ ఏది?
"డీఫారెస్టేషనే
మానవ ప్రస్టేషనా?"
నా పండ్లు తిన్నావు...!
నా పూలు పెట్టుకున్నావు..!
నా పసర్లు పిండుకున్నావు..!
నా ఔషదాలు
వేసుకున్నావు..!
చివరికి నీ గొడ్డలిపోట్లు
నా కడుపున దించావు
నా "కలపను వాడుకున్నావు!
నా కలప అమ్ముకున్నావు!
నా కలపతో
సొమ్ము చేసుకున్నావు!
నీ భవనాలు
నిర్మించుకున్నావు"
అయినా
" నీ కడుపు నిండ లేదా?
మా వెంట పడ్డావు
నేను మొక్కని రా.....!
మీకు "ఉదజనినిచ్చే "
చెట్టునిరా...
"నరకకురా నన్ను "
ఒంటరైపోతావు...
"ఓజోన్ పొర"
చిరిగిపోతుందిరా...
"అతినీల లోహిత"
కిరణాలతో
మానవ వాలికి
"అనంత క్యాన్సర్లు "
వచ్చేనురా...
నరకకురా నన్ను...
నాటరా " మళ్లీమళ్లీ..."
నా మొదల్లకు "గొడ్డళ్ల" దెబ్బలు..
నా దేహాలకు జెసిబిల గాయాలు...
నా మొద్దులను సరిహద్దులు దాటిస్తున్నారు
"నాతనువు"వెల్ల గాయాల
కన్నీటినిలువలురా...
నేను చేసిన అపకారం
ఏమిటిరా? మానవ కోటికి!
నేను "పరోపకారినిరా"...
పీకకురా నన్ను
" కూకీ టేళ్లతో పీకకురా..
నా ప్రేగులు తెగిపోతున్నాయి...
నా మృదు కణజాలాలు విడిపోతున్నాయి...
నా నీటి కణజాలాలు పగిలిపోతున్నాయి...
"
నా నీటి దారువులు" చీలిపోతున్నాయి రా..
నా తల్లివేర్లు తల్లఢిల్లి తుంచబడుతున్నాయి...
నా తోడు ఆకులు రాలిపోతున్నాయిరా..
నా శరీర భాగాల కొమ్మలు విరిగిపోతున్నాయి....
"నా వెన్నుపూసలు"
రంపాలతో" మొద్దులముక్కలుగా"
కలప వస్తువులుగా
"యంత్రాలలో" కోయబడుతున్నాయిరా...
" నా తనువే"
నీ కొరకు రా...
నరకకు రా...
నన్ను నరకకురా...
ఏది అభివృద్ధి రా...?
ఏది వినాశకం రా..?.
ఏది బహుళ ప్రయోజనం రా...?
ఫారెస్టేషన్" వట్టి మాటలు"రా డిఫారేస్టేషన్
"గట్టి మూటలు"రా
ఇవి అసలైన నిజాలురా...
"నా చెట్టుమనసు" తెలుసుకోరా...?
"నా విత్తనాలు దాచుకోరా "...
నేను బ్రతికితే....
"నువ్వు బ్రతుకుతావురా!
అడవులు విరజిల్లుతాయిరా..!
పర్యావరణాలు బాగుంటాయిరా!
భవిష్యత్తురాలు
నిరంతరం పచ్చగా
బ్రతుకుతాయిరా..!
నీకు చేతనైతే
"మొక్క నాటు"
"చేవ" వుంటే
మొక్కలా బ్రతుకు..
నీకుచేతనైతే చెట్లను నాటించు...
చేతనైతే
అడవులను
పరిరక్షించు....
వన్యప్రాణులను
సంరక్షించు..
వృక్షో రక్షతి రక్షతఃహా!
జై హింద్.....

డాక్టర్.కందుల సుధాకర్
సేవ రత్న
ఖమ్మం జిల్లా9390708322.

## చట్టం సాహితీ లోకం
95814 19999

### కవిత...

### నా స్వరూపం



రాస్తాను...
హృదయం పలికిన మాటలను పదాలుగా నేస్తాను,
చదువుతాను...
మనసును మేల్కొలిపే అక్షరాలను ఆస్వాదిస్తాను.

పాటలా పాడతాను...
ప్రతి హృదయంలో రాగాల్ని మోగిస్తాను,
బొమ్మలా చిత్రిస్తాను...
భావాలకు రంగులు అద్ది జీవం పోస్తాను.

పూలహారమై అల్లుకొని,
ప్రేమ హృదయాలకు అర్పిస్తాను,
వేసవిలో వాన జల్లులై
చల్లని హాయిని కురిపిస్తాను.

చలికాలంలో వేడి పల్లీలై
స్నేహపు ఉష్ణాన్ని పంచుతాను,
సోమరిని చైతన్యపరచి
కొత్త దారిని చూపిస్తాను.

బాధకు ఓదార్పుగా మారి,
కన్నీటిని ఆనందభాష్పాలుగా మార్చుతాను,
సంతోషాన్ని రెట్టింపు చేసి
జీవితాన్ని వెలుగులతో నింపుతాను.

అలసట తీర్చే మధుర గీతమై,
మనసుకు మంచి కాలక్షేపమవుతాను,
బూజు కర్రలా సమాజంలోని
దుమ్ము, దుర్మార్గాలను దులిపేస్తాను.

కత్తిలా చెడును ఖండించి,
నిజం కోసం నడిచే తూటానై నిలుస్తాను,
మల్లెపూవు మకరందంలా
మంచితనం పరిమళం వెదజల్లుతాను.

అన్యాయానికి ఎదురు నిలబడి,
సత్యానికి సాక్షిగా నిలుస్తాను,
మనిషిలో మనిషితనాన్ని
మళ్ళీ మేల్కొలిపే దీపమవుతాను.

ఏదైనా చేస్తాను... చేసి చూపిస్తాను,
అక్షరాల శక్తితో ప్రపంచాన్ని మార్చుతాను---
నేను కవితను...
నా ప్రయాణానికి హద్దులే లేవు!ఉండవు.

మిత్రాజి
(గుండవరం ప్రభాకర్ రావు పంతులు )
అత్వెల్లి గ్రామం,
మేడ్చల్ జిల్లా

## చట్టం సాహితీ లోకం
95814 19999

### తీపి గుర్తులు



తీపి గుర్తులు
మనసులో నాటుకున్న మధుర క్షణాలు
కాలం ముందుకు పరుగెత్తినా
మనసు మాత్రం ఆ జ్ఞాపకాల దగ్గరే ఆగిపోతుంది.

నవ్వుల మధ్య గడిచిన రోజులు,
ఆప్యాయతలతో నిండిన క్షణాలు,
మాటల్లో చెప్పలేని ఆనందాలు
ఇవన్నీ కలసి జీవితాన్ని అందంగా చేస్తాయి.

దూరమైపోయిన మనుషులు,
మారిపోయిన పరిస్థితులు,
తీపి గుర్తులు మాత్రం
మన హృదయంలో ఎప్పటికీ నిలిచిపోతాయి.

కాలం తీసుకెళ్లేది సంవత్సరాలనే,
కానీ జ్ఞాపకాలు మాత్రం
మనతో పాటు జీవితాంతం ప్రయాణిస్తాయి.

అందుకే
మన జీవితానికి మధురమైన సంపద
తీపి గుర్తులు.
ఎప్పటికీ మరువలేని
మనసులో నిలిచిపోయే స్మృతులు.

రామడుగు వేణుగోపాల్
దోహా , ఖతార్ (మంథని)

## చట్టం సాహితీ లోకం
95814 19999

### సత్య సారం



కాసుల కోసం గుణాలు మరిచి
మదిలోన పెడ దారులు తెరిచి
మానవత్వం నీ ఎదలో తుడిచి
సాగే ఓ మనిషి ఏమిటి ఈ తెలివి

మూడు పూటలా ఆహారము తిని
సాగే నిత్య జీవన సరళిని మరిచి
అంతు లేని ఆశల సుడిగుండంలో చిక్కి
ప్రకృతి సహజీవన సత్య సారం విడిచి

వేద సారమే పరమ మోక్షమని
మానవసేవలు మాధవుని సేవలని
పరులను ఓర్వలేని దారిలో నడిచి
ఏమిటి నీ ఉనికి పర నిందలకే మరిగి

సమస్త జీవుల సహ జీవనమెరిగి
కలిసి జీవించు వాటి ఐక్యతనెరిగి
ఆకలి బాధలను నేడు పక్కకు నెట్టి
దోచుకుంటున్నావు ఇతరులను పట్టి

వ్యాపారం కోసం ధనమును సృష్టించి
వ్యాపారము విడిచి ధనలోభివై నిలిచి
ఫలితం లేకుండా ఫలములను ఆశించి
పతనమౌతున్నావు నిజమును మరిచి

రచన: బిటవరం శ్రీమన్నారాయణ
ఎలుకుర్తి హవేలి వరంగల్

## చట్టం సాహితీ లోకం
95814 19999

### పరాభవానికి "పరాభవ" శుభాకాంక్షలు...!



ఆది అనాది కాలం నుంచి
యుగ యుగాల నుండి
నిత్యనూతనంగా వస్తుంది ఉగాది

గత సంవత్సరం విశ్వావసు నామంతో వచ్చి
విశ్వాసాలను వమ్ము చేస్తూ విశ్వమంతా
అల్లకల్లోలం చేస్తుంది ఉగాది

మరి ఈ సంవత్సరమేమో పరాభవ
నామ సంవత్సర ఉగాది అంటూ పేరు మార్చుకొని
పుడమి పై కాలు మోపుతుంది ఉగాది

స్వాగతం చెప్పాలని మనసు ఉబలాటం పడుతుంది
కాని మది బిక్కుబిక్కు మంటూ భయపడుతుంది
ఎవరిని పరాభవ చేస్తుందో ఏమోనని....

యుద్ధం లో ఎవరిని పరాభవం చెందుతారో
రాజకీయ క్రీడలో ఎవరిని పరాభవం చెందుతారో
ఇంధన మంటలు ఎవరిని పరాభవం చేస్తాయో మరి

సరదా కోసం యుద్ధం చేస్తున్నామని ఒకడు
మనుగడ కోసం పోరాటం చేస్తున్నామని మరొకడు
మధ్య తరగతి ప్రజలను మభ్యపెడుతున్నారు

మసిపూసి మారేడు కాయ చేస్తూ కోతలు కోస్తున్నారు
ఒకరిపైఒకరు క్షిపణి లతో దాడి చేస్తున్నారు
మిస్సైల్స్ తో వసుధ ను చిందరవందర చేస్తున్నారు

ఆయనకు ఆయనకే నోబుల్ శాంతి బహుమతి
గుంజుకుంటాడు
తనకు తానే శాంతి కపోతమని
ప్రకటించుకొంటాడు
నిజమే కదా వేలాదిమంది మరణానికి కారకుడు వాడు

ప్రజాస్వామ్య ముసుగులో నియంత హంతక రూపివాడు
వేలాదిమంది ప్రాణాలు తీస్తున్న పాపి వాడు
మానవ రూపంలో నున్న రాక్షసుడు వాడు

ఓ పరాభవ నామ సంవత్సరమా..!
ప్రపంచమంతా పరాభవ(వం) పొందకుండా
అహంకారముతో విర్రవీగే వారికి మాత్రమే పరాభవం చేయి

రాబోయే ప్లవంగ నామ సంవత్సర ఉగాది కల్లా
విశ్వమంతా శాంతి సౌభాగ్యాలు విలసిల్లాలని
విశ్వావసు సాక్షిగా విశ్వం పరాభవ(వం) చెందకూడదని

కోరుకుంటూ పరాభవ నామ సంవత్సర
ఉగాదికి స్వాగతం సుస్వాగతం చెపుతూ
పరాభవానికే "పరాభవ" శుభాకాంక్షలు
అందరికి...!

రచన:- వేనాప
వేంకట నారాయణ పరిమి
భవాని నగర్ కోదాడ
98484 32533

## చట్టం సాహితీ లోకం
95814 19999

### వాస్తవం



జరగడానికి ముందే
మంచి జరుగుతుందనుకోండి!
జరిగిపోయిన తర్వాత
మన మంచికే జరిగిందనుకోండి!
కాలానికి మాత్రమే తెలుసు
ఎవరికి ఎప్పుడు ఏమి ఇవ్వాల్లో
ఏమి ఇవ్వకూడదో అనేది?

ఎవరు ఎప్పుడు పరిచయం
అవుతారో తెలియదు
ఎవరు ఎప్పుడు విడిపోతారో
ఎవరికీ తెలియదు
ఎవరి మనసు ఎప్పుడూ
ఎలా మారుతుందో తెలియదు
ఎవరు ఎప్పుడు ఎలా
ప్రవర్తిస్తారో తెలియదు
ఎవరు మనతో కడవరకూ
కలిసి ఉంటారో తెలియదు
తెలియని ప్రతీ మనిషీ
జీవిత కదా ఇంతేనా?

అస్తమించిన సూర్యుడు తిరిగి
ఉదయించడం ఎంత వాస్తవమో
పోరాడి పోరాడి ఓడిన వాళ్ళు
ఏదో ఒక రోజు విజయం
సాధిస్తారనేది అక్షర సత్యం
ఈ నిజాన్ని నువ్వు తెలుసుకో!

రచన : కె.మురళీమోహన్ రాజు
నెల్లూరు.
సెల్ : 9866179385

## చట్టం సాహితీ లోకం
95814 19999

### సుగుణాల రాశి -రమ దాన్ :



ఇస్లాం పవిత్ర గ్రంథం అవతరించిన మాసమది
ఇస్లామిక్ క్యాలెండర్ లో తొమ్మిదవదది
ఇలనువెలసిన అతి పవిత్ర మాసమది
మనిషి మనసులోని చింతలు పోగొట్టేది
మనసుకు ఆధ్యాత్మిక చింతలను పెంచేది

మానవులందరికిక్రమశిక్షణ నునేర్పునది
రోజును రోజా తో ప్రారంభించునది
తెల్లవారి జామున సహరి తో మొదలయ్యేది
సాయంత్రం ఇఫ్తార్ తో ఉపవాసన్ని విరమించేది
పెద్దలకు పిల్లలకు జకాత్
నేర్పినమానసికఅలవాటది

పేదవారికి ఉన్నదానిలో కొంతధన వస్త్ర రూపంలో ఇచ్చునది.
ఎన్నో ఆరోగ్య సూత్రాలను అలవాటు చేయునది
జాకత్ ఉల్ ఫితర్ ముఖ్య మైనది
అందరి ఆనందాల ఆత్మీయ అనందహేళది
ఈద్ ఉల్ ఫితర్ పవిత్ర మైన రోజు ఇది

ఉదయం ప్రత్యేక ప్రార్ధనల సమయం
నూతన వలువలు ధరించు తరుణం
ఈద్ ముబారక్ అంటూ ఆలింగణాలు
ఆనందాల మానసిక శుభాకాంక్షలు

షీర్ ఖుర్మా వంటి ప్రత్యేక వంటకాలు
ఇరుగు పొరుగు వారికి పంపకాలు
ఎన్నో సుగుణాలరాశి అయి
మరెన్నో వాసి గల శుభ పండుగ ఇది

**ముస్లిం సోదరసోదరీలందరికి రంజాన్ పండుగ శుభాకాంక్షలు.**

డాక్టర్ కవికోకిల కొఠారి వెంకటరత్నం.
కవి, రచయిత, విశ్రాంత ఉపాధ్యాయులు
వి. కోట. చిత్తూరు జిల్లా.

## చట్టం సాహితీ లోకం
95814 19999

### నూతన వత్సరమా స్వాగతం



శుభము పలుకుతూ రావమ్మ
పరాభవ నామ సంవత్సరమా
శుభాలనే చేకూర్చగ రావాలమ్మ
సకలలోకముల నెల్ల కాపాడమ్మ

షడ్రుచుల పచ్చడను తాగుదుము
కష్టసుఖాలను దైర్యంగా ఎదురు కొందుము
నూతన వస్త్రాలనే ధరించియు
పంచాంగ శ్రవణం చేయుదుము

రాశి ఫలములను చూసుకొందుము
ఆదాయ వ్యయాలు తెలుసుకొందుము
నూతన వత్సర జాతక ఫలములను
తెలుసుకొని తృప్తినొందుచుందుము

విశ్వావసులో పాట్లనెంతో పడ్డాము
కష్టసుఖాలను చవి చూశాము
బతుకులోన మరువలేని అనుభవాలను పొందినాము

యుద్దాలు జరుగుటచే ప్రపంచాన
జనమంతా ఇబ్బందులకు గురైతున్నారు
విపరీతమైన ధరల పెరుగుగుదల వలన
బతుకులు భారమనిపిస్తున్నాయి

గ్యాసు లభించుట గఘనమాయె
బ్లాక్ మార్కెట్ లో ధరలెక్కువాయె
అమ్మబోతే అడివి చందమాయెను
కొనబోతే కొరివిలా అనిపించెను

శాంతి కాముకులై నాయకులు
పోరును ఆపి శాంతిని నెలకొల్పాలి
జగమంతా శాంతి కపోతములనే ఎగుర వేయాలి, ఎగుర వేయాలి

పోరు నష్టం పొందులాభం అన్నది
నిజమే అని తెలియుచున్నది
ఐక్యరాజ్య సమితి చొరవ తీసుకొని
యుద్దాలను ఆపాలని కోరుచుంటిమి

అక్కి నర్సింలు గౌడ్
విశ్రాంత ఉపాధ్యాయుడు
మల్లాపూర్ రంగారెడ్డి జిల్లా
కవి గాయకుడు

